కళ్యాణి

రాయపేటలో విన్నాడు ఆ రికార్డు ఏదో హోటల్లోంచి "నీదు చరణములేగతి" అని కళ్యాణి పాడిన రికార్డు. రెండేళ్లై వుంటుంది కళ్యాణిని రేడియోలో విని. ఆమె ప్రోగ్రాం వున్నప్పుడల్లా మద్రాసు రేడియోకి రాశాడు ఆమె పాటని మెచ్చుకుంటూ. ఆమెకి అరగంట ప్రోగ్రాములేగాని అంతకన్న ఎక్కువ ఎప్పుడూ ఇచ్చేవారు కారు. మరి తాను అడగగా అడగగా అంతకన్న ఎక్కువసేపు పాడడానికి ఆమె నిరాకరిస్తోందని ప్రత్యుత్తరం చెప్పారు. ఆమెకి వుత్తరం రాయాలని తాను ఆమె చిరునామా అడిగితే చెప్పడానికి వీల్లేదన్నారు. క్రమంగా ఆమె పాట రేడియోలో వినపడడం మానేసింది. తాను ఎన్నో వుత్తరాలు రాయగా, ఆమె ఎక్కడున్నదీ తమకే తెలియదన్నారు రేడియోవారు. ఆమెపాట తనకే ఇష్టం. తనకి తెలిసినవారిలో ఆమెని ప్రత్యేకంగా గమనించినవారు లేరు. మిత్రులకి వినిపించినా, వాళ్ళు 'బాగానేవుంది' అనేవాళ్లు. సంగీతపాటవులు అసలే వొప్పుకోలేదు. ఈనాడు మళ్ళీ విన్నాడు ఆమె రికార్డుని. ఆమె జ్ఞాపకం వొచ్చింది.

ఆనందరావుది ధాన్యం వర్తకం. కాని భావకవి. కళ్యాణి పాటమీద మూడు గీతాలు రాశాడు. తక్కిన తన కవిత్వంతోబాటు ఆ గీతాలు అజ్ఞాతంలోనే వుండిపోయినాయి. అతని గీతాల్ని మెచ్చుకున్నవారే కాని అచ్చు

వేసినవారు లేరు. అవే అచ్చుపడితే తనకి చాలా గొప్పకీర్తి వొస్తుందని అతని దృఢవిశ్వాసం. కాని ఆ విశ్వాసం ఏ పబ్లిషర్సుకీ లేదు. అత నెంత వినిపించినా, శ్లాఘించుకున్నా వాళ్ళకా విశ్వాసం కుదరలేదు. రెండేళ్ళక్రిందట ఓ సారి బెజవాడలో రైలులో ఖాళీ దొరక్క తంటాలుపడుతో వుండగా First Class లోనించి తనపేరు కేకవేశాడు దొరైకన్ను. దొరైకన్నూ తానూ ప్రెసిడెన్సీ కాలేజీలో సహాధ్యాయులు. దొరైకన్ను చాలా ధనవంతుడు. తెలుగు తెలుసు. హాస్టల్లో ఒకటే గది వాళ్ళది. ఆ రోజుల్లోనే తాను రాసే కవిత్వం వినిపించేవాడు మిత్రుడికి. అతను ఆనందించేవాడు. ఈనాడు తనని చూడగానే, కుశలప్రశ్న లడుగుతో వుండగా రైలు కూసింది బైలుదేరడానికని. ఆనంద్ పరిగెత్తడానికి ప్రయత్నించాడు:

"ఎక్కడికి?"

"ఏలూరులో కనపడతా. రాజమండ్రి వెళ్ళాలి."

దొరైకన్ను మాట్లాడకండా అతన్ని లోపలికి గుంజాడు. ఆనంద్ తన పసుపుపచ్చ టిక్కెట్టు చూపాడు.

"పరవాలేదు. నేను చూసుకుంటాలే" అన్నాడు అతను.

అది ఒకటేసారి అతను మొదటితరగతిలో ప్రయాణం చేసింది. అంత బీదవాడు అతను. అందుకనే తనగీతాల్ని అచ్చు వేయించుకోలేకపోయినాడు. దొరైకన్నుకి అతని కవిత్వం చాలా జ్ఞాపకం. కొత్త గీతాలు చదవమన్నాడు. ఆ కవి హాయిగా పరుపుల్ని ఆనుకుని, పంకాలకింద టీ

తాగుతూ, రొట్టె తింటూ, State Express సిగరెట్లు అంతం లేకుండా కాలుస్తూ, రాజమండ్రిదాకా తన కవిత్వం అప్ప చెప్తున్నాడు సహృదయుడైన మిత్రుడికి. ఆ రోజు అతని కేదో రాజయోగపు గ్రహం పట్టిందనుకున్నాను తరవాత రోజుల్లో.

"మరి అచ్చు వేయించావు కావేం! ఇంత గొప్ప కవిత్వాన్ని!"

"ఎవరు వేస్తారు?"

"నువ్వే!"

"నేనేం బిర్లా ననుకున్నావా, దొరైకన్ను నను కున్నావా?"

"దొరైకన్ను ననుకో, పుస్తకం పంపించు."

తన అచ్చుగాని గీతాల్ని సదా చేత్తో పట్టుకుని తిరగని భావకవి ఇంతవరకు జన్మించలేదు.

"పంపడ మెందుకు? ఇక్కడేవుంది."

అని మిత్రుడి కిచ్చాడు తన కావ్యాన్ని.

"అచ్చువేయించి నీకు పంపుతాను."

"ఎట్లా వుండాలంటే పుస్తకం...?"

"నా కవేం చెప్పనక్కర్లేదు. నీ పుస్తకం పోకముందు ఓమర్ ఖయూం, ఊర్వసీ ప్రవాసం, గీతాంజలీ, ఎందుకూ పనికిరాకండా కనపడేట్టు వేయిస్తానుకదూ!"

"ఎందుకు నువ్వు వేయించడం?"

"నేను చదువుకోడానికి. రాతఅక్షరాలు చదవలేను బాగా. అచ్చువేయించి చదువుకుంటాను. జాగ్రత్తగా చదువుకోవాలి కొన్ని గీతాలు, వాటి సారస్యం అర్థంకావా లంటే. నీకు అయిదువేలకాపీలు వేయిస్తాను. చాలా?"

"దేనికి చాలా? ప్రజలకా? మా దేశంలో ఓ వెయ్యి సంవత్సరాల అమ్మకానికి చాలు అవి"

తన కవిత్వంమీద ద్వారైకన్ను ఇష్టం. తనకీ కళ్యాణి సంగీతంమీద ఇష్టంలాగే వుంది.

ఆనాటి తరవాత తాను కళ్యాణిసంగతి వినలేదు, ద్వారైకన్ను సంగతి వినలేదు; తన గీతాలేమైనాయోకూడా తెలీదు. రెండేళ్ళయింది.

ఈనాడు విన్నాడు ఆ రికార్డు మళ్ళీ. ఆ రాత్రి రాయపురంలో తన host ని కళ్యాప్రియుణ్ణి అడిగాడు "కళ్యాణి అని ఒకామె రేడియోలో పాడేది నీకు గుర్తుందా? రెండు రికార్డులుకూడా ఇచ్చింది."

"తెలీదు, కాని, ఏం?"

"ఆమె ఏమయిందని?"

"లేదా? ఎందుకు?"

"ఆమె పాట నాకు చాలా యిష్టం."

"ఆమె పాటా? ఆమా? రెండూనా?"

"ఆమెని చూడలేదు నేను."

"ఏమయిందో రేడియోవాళ్ళ నడుగు."

"రాశాను. వాళ్లు చెప్పరట."

"వెళ్ళి అడుగు."

"ఎవరు మాట్లాడతారు?"

"అదేమిటి మన రాజయ్యకి ఢిల్లీనించి మద్రాసు స్టేషన్‌కి బదిలీ అయింది, తెలీదా?"

"రాజయ్యకా? కాని ఇది పాతచరిత్ర కళ్యాణిది."

"కనుక్కొని చెపుతాడులే, వుండు." అని ఫోనులో రాజయ్యని పిలిచాడు.

"ఎప్పుడు తీరుబడి? మన ఆనందరావొచ్చాడు. ఇక్కడే నాతోనే వున్నాడు. ఎప్పుడు వొస్తావు? మధ్యాన్నం భోజనానికి రా ఒంటి గంటకి. మరిచిపోకు వెధవా." అని ముగించాడు.

చప్పున మళ్లీ కాల్ పెట్టి, రాజయ్యని మళ్లీ రప్పించి,

"రేపు రాకపోతివా, నీ కంఠధ్వని చచ్చిపోయే పంది గురకమల్లే, చెడిపోయిన Ford కారు చప్పుడల్లే వుందని రాస్తాను మీా స్టేషన్‌కి" అని ఆనంద్ చెప్పమంటున్నాడు"

అని ఫోన్ కిందపెట్టేశాడు.

ఒంటిగంటకి వొచ్చి వొండినవన్నీ తినేశాడు రాజయ్య.

"నీతో వోపని వుందోయ్."

"అవును."

"అవునేమిటి? నీ కెట్లా తెలుసూ?"

"పనిలేకపోతే, నామీాద ప్రేమవల్లనే, నా జ్ఞాపక మాధుర్యం భరించలేకనే నన్ను భోజనానికి పిలిచావనుకున్నానా ఏమిటి?"

"ఏం? నీతో ఏంపని?"

"ఈ కాలంలో న్యూసు పేపరు రిపోర్టర్లతో, రేడియో మనుషులతో పనిలేనివాణ్ణి ఒక్కణ్ణి చూపించు. వాడికి నా ఖర్చుతో శిలావిగ్రహం కట్టిస్తాను."

"ఏడిశావులే వెధవగర్వం. ఏదో ప్రపంచచక్రం నీ మీద నడుస్తోందనుకుంటున్నావు. నీ 'ఇనుపతట్టల' సంగీతం నువ్వూవు. 'ఇంతవరకూ మీరు రికార్డుల సంగీతం విన్నారు' అన్న మహా తెలివైన వాక్యం చెప్పడమేగా నువ్వు చేసేపని! నువ్వు వేరే చెప్పాలా ఆ సంగతి? రేడియోలముందు మేము యేమంటోవుంటామో అవి మీకు వినిపించేవిధం వుంటే బావుండును."

"పోస్టులో వినిపిస్తోనే వుంటారు"

"అసలు మేము అనేమాటలు రాయడానికి వీల్లేదులే. పైగా వాటి కో ముక్కానీ ఖర్చా!"

"సరేలే, ఇంతకీ ఏమిటో ఏడు. ఎవత్తెకో ప్రోగ్రాం ఇప్పించాలి. అంతేనా? ఆడిషన్ వుండకూడదు. ఏంపాడుతుంది? రెండునిమిషాల కో సారి అప్రయత్నంగా శృతీ లయా మారుతో ఎవరూ ఎన్నడూ వినని సొంతరాగంతో తాళంలో—

"తల ఎత్తి చూడరా, ఆంధ్ర సోదరుడా,

విలపించుచున్నాది భారతమాత!" అది పాడింది—

మొన్న ఒకామె,

ఓ తెలుగు రేడ
పదవోయి అదుగోను నీ తెలుగు మేడ
కట్టవోయ్ నీచుట్టు ఓ తెలుగు గోడ
ఏడ్వావోయ్ కనపడక నీ తెలుగు జాడ
బెదరకోయ్, రేడ, అది అరవనీడ
ఎగురుచున్నది చూడు నీ తెలుగు మూడ
అలకవోయ్ నిళ్ళల్లు తెలుగు గేదెల పేడ
తొలగించవోయ్ అఖిలాంధ్ర దేశంబు పీడ
ఓ తెలుగు రేడ, నా తెలుగు రేడ.

కాకపోతే.

కోకిల కూసింది.
గాలులు వీచాయి.
త్యాగయ్య పాడాడు.
దుమ్ము చెలరేగింది.
తుమ్మెద ఎగిరింది.
మబ్బుల్లు వేశాయి.

రారా, రారా, ప్రియా, రంగం పోదామూ— అంటుంది.

"మీరు అంతకన్న మంచివాళ్ళని వీరుకుంటున్నారా - ఎవరికి తెలీదురా. అక్కడ పాడేవి కంఠాలు కావురా! చీరెలు, రెవికలు లేకండా—

"పోరా. అందరిమల్లే నువ్వూ బుద్ధిలేకండా మాట్లాడతావు!"

"వినపడుతోనే వుంటాయి లేరా!"

"ఏమిటి?"

"చుప్, చుప్ మని శబ్దాలు రేడియోలో."

ముగ్గురూ నవ్వారు.

"సరేలే, తొరగా చెప్పు పోవాలి."

"రెండేళ్ళకిందట కళ్యాణి అని యీ స్టేషన్‌నించే పాడేది నీకు తెలుసా?"

"తెలీదు."

"తెలీదూ? తెలీపోతే ఎందుకు బతుకుతావు? ఆ మైక్‌కి ఉరేసుకు చావరాదూ?"

"ఎత్తు చాలదు."

"ఆమె ఏమయిందో కనుక్కుని చెప్పు."

"ఏమయింది."

"అదే నిన్నడుగుతోంది, మొద్దూ. రేడియోలో వినపట్టంలేదూ, ఆమె సంగీతం."

"రాసి కనుక్కోకపోయినావూ?"

"నీ అంత బుద్ధితక్కువవాళ్ళ మనుకోకు. ఒకే వొప్ప చెప్పరా, చూద్దాం."

Under the Spreading Chestnut Tree. రాదా? బెంచెక్కు, జ్ఞాపకం వుందా?"

"రాశాంరా బాబా. తెలీదన్నారు నీ అంత తెలివే గల నీ సోదరులు."

"కనుక్కుంటాలే. ఎందుకు ఆ కళ్యాణి నీకు?"

అవును తనకి ఆ కళ్యాణి ఎందుకు; అనుకున్నాడు కాని ఎందుకో కావాలని అనిపించింది.

"ఎందుకోలే, కనుక్కుందూ."

"సరేలే. నాకు తీరిక లేదు. టెలిఫోనులో చెపుతాను." అని వెళ్ళి టెలిఫోనులో చెప్పాడు మర్నాడు—

"అవును, ఆ కళ్యాణిది చాలా విచిత్రమైన చరిత్ర లాగుందోయ్. విను. ఆమె బీద ఆమె. కాని..."

"అదంతా నాకెందుకు? ఆమె ఇప్పు డెక్కడవుంది?"

"ఏమో, తెలీదు."

"ఇదా నువ్వు తెలుసుకుంది?"

"తెలీదంటోవ్పుంటే."

"సరేలే, చావు"

"విను మరి."

"ఇంకా వినేదేమిటి?"

"ఆమెసంగతి."

"ఆమెసంగతి నాకెందుకు? ఏమయిందో కావాలి. అది తెలీకపోయింతరవాత..."

"చూడు, మనవాడితో చెప్పు రాత్రికి భోజనానికి వస్తున్నానని. తొమ్మిదింటికి. ఆ వాక్కాయల పచ్చడి, ఆవడలు, ఆ పనసకాయ కూర, అన్నీ మళ్ళీ చేయించమను"

"ఏమిటి రాత్రిపూటకా?"

"మరి పగలు డ్యూటీ నాకు. రాత్రికే."

అని టెలిఫోను మూసేశాడు.

రాత్రి చెప్పాడు కళ్యాణి వైనం—

"ఆమె చాలా బీదరికంలో వుండేదిట. గొప్ప పాటకు రాలు కాదు. కాని కంఠపు మార్దవంతో నేర్పరితనంతో పాటని మెరిపించేది. డబ్బుకోసమే రేడియోని ఆశ్రయించింది. ఒక విధమైన అభిరుచులవారు ఆమెపాటకి ఇష్టపడేవారు. చప్పున ఆమె అదృష్టం తిరిగింది. ఆమె రూపవతి. ఆమె పాటని ఇష్టపడ్డ ఒక సినిమా డైరెక్టరు, ఆమెని ముఖ్య పాత్రకై బుక్ చేసుకుంటా నన్నాడు. ఆమె ఆలోచించిగాని చెప్పనన్నదట. ఆ సమయానికే ఒక జమీందారు ఆమెని తనకి పాడుతో వుండడానికై పెద్ద జీతమిస్తానని ఆహ్వానిం చాడు. గ్రామఫోనువాళ్ళు ఆమె వెంటపడ్డారు. పాటకచ్చేర్లకి పిలవడం ప్రారంభించారు. ఇదంతా ఎట్లా తెలుసునంటే, రేడియోలో భద్రయ్య రహస్యంగా ఆమె ఇంటిదగ్గర ఆమెకై పడిగాపులు పడుతున్నాడు."

"ఏమిటి? భద్రయ్యా? నాన్ సెన్సు?"

"ఏమి టా నాన్ సెన్సు."

"భద్రయ్య నీతి అవతారం కాదుటోయ్? నాట కాల్ని, నీతి Standard కి వ్యతిరేకమని, రేడియోలో ప్రసా రం చెయ్యకూడదని పోట్లాడుతాడు కాదుటోయ్?"

"అవును. అందులో విచిత్రమేముంది? అవినీతికథలు వెయ్యమనే పత్రికాధిపతుల నీతిచరిత్రలు పరిశీలించు."

"ఓ, అదా? అంటే తమకితప్ప శ్రోతలకి శృంగారం మీద బుద్ధి పోకూడదనేమో!"

"కాదోయ్. వీళ్లోరకమైన రసయోగులు. సంస్కారాధిక్యతవల్ల అవినీతిని భూషణంగా ధరించి భర్జించుకోగల రన్నమాట. తమది ఉన్నత శృంగారాన్వేషణ. తక్కిన వాళ్ళది తుచ్ఛ వ్యభిచార వాంఛ."

"సరేలే చెప్పు. ఆ రాజయ్యే ఏం చేశాడు కళ్యాణిని?"

"ఏమో ఎవరికి తెలుసు? ఈ శృంగారజీవులు తమ విరహబాధనేగాని, విరహనివృత్తిని చాటుకోరు. రోజూ రేడియో స్టేషనులో విలపించేవాడుట, ఆ కళ్యాణి ఏదో మానుషాతీత జ్యోత్స్న అని."

తాను ఆమె పమిట చెంగును స్పృశించటానికి అనర్హుణ్ననీ, ఈ లోకపు పురుషకీటకాలు ఆమెను డబ్బు ఆశతో భ్రమపెట్టి తననించి తీసుకొనిపోయి వొంచించాలని చూస్తున్నారనీ. కాని ఆమె బీదరికం ఆమె మనసుని ఎప్పుడు బలవంత పెడుతుందోనని అతని భయం.

"ఆమె ఏమంటోందిట?"

"ఆమెకి పురుషులతో సంబంధం చాలా ఏహ్యం. తనమీద ధనాలు గుమ్మరిస్తామని తిరిగేవారి ఉద్దేశ్యాల మీద అనుమానం వల్లనే ఆమె ఆ Offers అన్నిటినీ నిరాకరించింది."

"నేను చెప్పలేదుటోయ్, ఆమె చాలా ఉన్నతురాలని?"

అన్నాడు ఆనందరావు.

"రాజయ్యా ఏమంటాడు ? తనతో ఉచితంగా ఆమె చెయ్యాలని తాను కోరుకుంటున్న పనినే, ధనం తీసుకుని ఆమె ఇతరులతో చెయ్యకూడదంటాడు. అవునా?" అని అడిగాడు వాళ్ళవైపు చూస్తూ.

"ఆ ధనం ప్రసక్తి వచ్చిందా అది రొమాన్సు కాదంటాడు ధనికుడు. దరిద్రంలో ఏడుస్తో స్త్రీ, ఆమె ఆత్మ ఔన్నత్యంకోసం, ప్రేమపారిశుధ్యంకోసం, ఏ ఆశాలేని నిర్మలమోహమని రుజువు చేసేందుకై ధనికుణ్ణి డబ్బు అడిగి బాధ పెట్టకూడదు."

"అవును. ఇంక ఆమె ఇంటిచుట్టు తిరిగి, ఆమెఇంటో టిఫిన్లు తిన్న భద్రయ్యా, తన నాలుగువందలరూపాయల జీతంలో ఆమెకి ఒక్క కానీ ఇచ్చి ఎరగడు" అన్నాడు రాజయ్యా.

"ఎంత గొప్ప స్త్రీ! కనకనే అంతగొప్ప సంగీతం పాడగలిగింది." అన్నాడు ఆనంద్.

"పోనీ భద్రయ్యాకి ఏమన్నా ముట్టిందా?"

"తెలీదన్నానుకదూ. అతని ప్రణయచరిత్ర అంతా ఏడుపులతోనే సరిపోయింది."

"తరువాత?"

"ఓ రోజు తెల్లవారేసరికి ఆమె ఇంటో లేదు."

"ఏమయింది? చచ్చిపోయి వుంటుంది. ఔనా?"

"ఇంతవరకు మళ్ళీ ఆమెను చూసినవారు లేరు."

"భద్రయ్య బాధ పడలేక పారిపోయి వుంటుంది."

"ఆ ధనవంతుల ప్రాబల్యానికి జడిసి, దాక్కుని వుంటుంది."

"దరిద్రం అనుభవించలేక చచ్చిపోయి వుంటుంది."

"ఏం చేస్తుందిమరి! ఇంటికి వెడితే సినీమా డైరెక్టర్లూ రేడియోకి వొస్తే భద్రయ్యా!"

"ఏంలేదు ఆమె లేచిపోయింది." అన్నాడు రాజయ్య.

"నాన్‌సెన్సు!"

"ఎవరితో?"

"ఎవరో ధనవంతుడైన చెట్టియార్‌తో."

"నిజమా?"

"నిజమే."

"తరవాత?"

"తరవాత ఏంలేదు. ఇంతవరకు తెలీదు ఏమయిందో" అని చెప్పి వెళ్ళిపోయినాడు రాజయ్య. అంతటితో తన అభిమానం సిగ్గుపడి కళ్యాణి ప్రసక్తి వొదులుకున్నాడు, ఆనందరావు. ఆనాటినించి ఆమె రికార్డువిన్నా ఏమీ సంచలనం కలగలేదు అతనిలో. అలా సెంటిమెంట్లతో అల్లుకుని వుంటాయి కళాభిరుచులు.

కళ్యాణి పాటవిని ఆమెని ఓ ఎత్తు పీఠంమీదికి ఎత్తాడు, మనిషినే. ఆమె చెట్టియారుతో వెళ్ళిందని విని ఆ మనిషిని పీఠంమీదనించి కిందికి లాగడమేకాదు, ఆమె సంగీతాన్ని అసహ్యించుకున్నాడు.

భీదరికంలో మాడి ఆమె చచ్చిపోయిందంటే, ఆమె మీాద ఓ గీతం రాసేవాడు గౌరవంగా. వ్రాసి తన ఆరాధనా రుణం తీరిందనుకుని తృప్తిపడేవాడు ఆ కవి.

రెండేళ్ళు గడిచాయి.

ఆనందరావుకి యుద్ధకాలంలో వ్యాపారంలో లాభం రాసాగింది. అంతటితో తాను ఒకప్పుడు కవినని పూర్తిగా మరిచిపోయినాడు. అంత సంబంధం, ఆకలికీ కవిత్వానికీ— తిండికోసం ఆకలి ఒకటేకాదు ఆకలి.

అతను ధాన్యం అమ్మే వర్తక మిల్లు యజమాని, అతని కూతురు పెళ్ళికి ఆనందరావుని భోజనానికి పిలిచాడు. భోజనానంతరం ఎవరో ఆనందరావుని అతను రాసిన గీతాలు చదవమన్నారు. ఆనందరావు కవిత్వం రాస్తాడా అని ఆశ్చర్యపోయినారు మిల్లువారు. తనతో పైసల దగ్గిర్నించి ఆనందరావుచేసే కటిక బేరాన్ని తలుచుకుంటూ, ఆనందరావు ఒక్కొక్క గీతాన్నే ఎత్తుకున్నాడేగాని ప్రతి దాన్ని మధ్యలోనే మరిచిపోయినాడు. బియ్యం ధరలు తప్ప ఇంకేమీా జ్ఞాపకం లేవు అతనికి.

మిల్లువారు సంవత్సరన్నరలో రెండు లక్షలు లాభాలు చేసుకున్నారు. తన పెద్ద కూతురికి పెళ్ళి సమయం. ధనంతోబాటు, అకస్మాత్తుగా ఆయనలో కళా రాధన ఉద్భవించింది. తానెందుకు కవి రసపోషకుడుగా ప్రసిద్ధి కెక్కకూడదు? ఆరాత్రే ఏర్పాటు జరిగింది. ఆనంద రావు గీతాలు మిల్లుకు అంకితమిచ్చేట్టూ, ఒక వెయ్యి కాపీలు అచ్చువేసి, వాటిని అమ్మి సగం లాభం ఆనంద

రావుకి ఇచ్చేట్టు — ఖర్చులుపోగా సగంలాభం అవి అమ్ముడుపోయిననాడు.

కాని అచ్చు వెయ్యడానికి ఆనందరావు గీతాల పుస్తకం ఏదీ?

ద్వొరైకన్ను చిరునామా తెలీదు. మద్రాసులో చిన్నప్పటి అతని ఇల్లు గుర్తు. ఆ అన్వేషణలో మళ్ళీ మద్రాసు వొచ్చాడు ఆనందరావు రెండేళ్ళ తరవాత.

ద్వొరైకన్నుని పట్టుకోడం కష్టంకాదు. ధనవంతుడు. చాలా ఆస్తి మద్రాసు ప్రాంతాలలో. కాని ఎవరూ అతనేమైనాడో ఎరగమన్నారు. అతనివాళ్ళెవరూ లేరు. అతని వ్యాపారం కంపెనీ ఎప్పుడో ఎత్తేశారు. కాని వెతికేది కవి. కాంతిని చూడబోయే తన కవిత్వంకోసం. అంటే తల్లి తన బిడ్డకోసం వెతుకుతోంది అన్నమాట.

చివరకి ద్వొరైకన్ను ఏజంటుని పట్టాడు. ద్వొరైకన్ను ఎక్కడికో వెళ్ళిపోయినాడు. ఎక్కడికి వెళ్ళాడో తనకి తెలియదన్నాడు ఆ ఏజంటు చాలా బలవంతం మీద - ద్వొరైకన్ను చిరునామా ఎవరికీ ఇవ్వద్దన్నాడన్నాడు. దివాలాతీసి, అప్పులపాలైనాడా? లేదు. ఆస్తి అంతా అట్లానే వుంది, మరి...?

తను ఒక ఉత్తరం ఇస్తాను ద్వొరైకన్నుకి పంపమని వొప్పించాడు ఏజంటుని. మూడోరోజుకి టెలిగ్రాం వచ్చింది, ఆనందరావుని ఏజంటునే స్వయంగా తీసుకుని రమ్మని. ఎక్కడకు తీసుకు రమ్మన్నాడో చెప్పనన్నాడు ఏజంటు.

ముందు రైలెక్కారు బెంగుళూరు మెయిలులో.
తరవాత కారెక్కారు. ఆకారు నిర్జనమైన కొండలదగ్గిర
వాళ్ళిద్దర్నీ దింపివెళ్ళింది. అక్కణ్ణించి నడిచారు. ఓ నది
అడ్డం వొచ్చిందాకా. అక్కడ షోకైన పడవ, తెల్లటి
రంగు, నిగనిగలాడే సీట్లు. పట్టు పరుపులు, పైనపందిరి.
మహారాజులకైనా అట్లాంటి పడవలుంటాయా? దాంటో
ఆనందరావుని ఎక్కించి ఏజంటు తిరిగి వెళ్ళిపోయినాడు. ఆ
పడవ అతన్ని ఆ నదిమధ్య ఓ ద్వీపంలో దించింది.

వొడ్డున అతనికోసం ఎదురుచూస్తో నుంచునివున్నాడు
దొరైకన్ను. చిరునవ్వుతో తనచేతినిజాచి వొడ్డుకి దించాడు.
కాని ఏమీ మాట్లాడలేదు. వెనక్కితిరిగి నడుస్తున్నాడు.
ఆనంద్ అతనివెంట వెళ్ళాడు. దొరైకన్నులో చాలా
మార్పువుంది. అతనిదృష్టి ఎక్కడో ప్రయత్నించి ఆనంద్ని
తన మనస్సులోకి తీసుకున్నట్టుగా వుంది; ఆ ద్వీపం ఒక
ప్పుడు ఒక పెద్ద అడవి ఐవుండాలి. ఆ పెద్ద పురాతన
వృక్షాల్ని అట్లానే వుంచి, కింద భూమినంతా శుభ్రం
చేశారు. కిందపడ్డ ఆకుల్నికూడా ఏరుతో పనిమనుషులు
ఎండనీడల్లో తిరుగుతో కనపడు తున్నారు. ప్రతి మూల
నించీ, చెట్ల సందుల్లోంచి అన్నివేపుల నది కనపడుతోంది.
పాయలుపాయలుగా ద్వీపంలోకి కోసుకుని వొస్తోంది. నీళ్ళు
వెనకాలికి వెళ్ళిన స్థలాల్లో కొన్నిచోట్ల అద్దంమల్లే ఒండ్రు
మట్టి మెరుస్తోంది. కొన్నిచోట్ల పచ్చని ఇసిక. ఆ నది కావేరి
ఐవుంటుందనుకుంటున్నాడు ఆనంద్. చెట్లపైన కోతులు,
పెద్దపెద్ద ఉడతలు పక్షులు కోలాహలం చేస్తున్నాయి. కొన్ని

చెట్లు మనుషులు నాటినట్టున్నారు. మంచిగంధం, టేకు, మర్రి, తురాయి, నిద్రగన్నెరుచెట్లు గుర్తుపట్టాడు ఆనంద్. మధ్యమధ్య చిన్నచిన్న పూలతోటలు వేశారు. సంపంగి, తీగసంపంగి, మాలతి, మధుమాలతి, మాఘవీలతలు, గుత్తులు గుత్తులుగా పూలు వేళ్ళాడుతున్నాయి.

నదికి కొంచెం దూరంగా నది కనపడుతూ పెద్ద దేవదారు వృక్షాలముందు వున్న ఒక వింత కాటేజి దగ్గరికి వెళ్లారు. అదంతా జపాను పరజాలలో అలంకరించారు. తలుపులూ గోడలూ లేవు. కొబ్బరాకుతో, రెల్లుతో, పల్చని రంగుల కాయితాలతో, పూల అద్దకపు బట్టలతో, చిన్న చిన్న చిత్రపటాలతో తయారుచేశారు. అంతా వెదురు పేము సామాను. కింద గచ్చు. దానిమీద చాలా అందమైన డిజైన్లువున్న మెత్తని రెల్లుచాపలు. బైటనించి కాంతి చెట్ల ఆకుపచ్చలోంచి, నదినీళ్ళమీది మెరుపులోంచి, ఆ రంగు కాయితాలలోంచిఅందఅందాలుగామృదువుగా పడుతోంది. లోపల మూడుగదులకన్న ఎక్కువలేవు. కాని పరజాలులాగి ఎక్కడికక్కడ గదులు కల్పించుకోవచ్చు. లోపల గ్రామఫోను, వీణలు, సితారు వున్నాయి.

వెళ్ళగానే దూరంనించి ట్రేలతో టీ, కేకులు, రసగుల్లాలు, వేయించిన అటుకులు తడివడియాలూ, అప్పడాలు తెచ్చారు నౌకర్లు. అవతల గదిలో పెద్ద లైబ్రరి కనపడుతోంది. ఇతను వొఖ్ఖడూ ఇక్కడ ఇంత ఆవరణంలో. అన్నిదిక్కులనించి గాలుల పువ్వుల పరిమళాలతో ఆ ఇంటి నిండా ఆడుకుంటున్నాయి, చిన్నచిన్న చప్పుళ్లు చేసుకుంటో.

ఆనందరావుకి నిశ్చయమయింది, తనపుస్తకం సంగతి దొరైకన్నుకి ఏమీ జ్ఞాపకంవుండి వుండదని. అడవిలో ఇట్లా హాయిగా నివసించే అతన్ని ఎట్లా అడగడం? అతనికీ ప్రపంచానికీ సంబంధం వున్నట్టులేదు. ఆ ప్రదేశం అందం వొంటరితనం, ఏదో వాతావరణం ఆనందరావునించి మాటలు లాగేశాయి. దొరైకన్ను మాట్లాడడేం పోనీ! మూగి ఐనాడా, ఋషి ఐనాడా, పిచ్చా!

"చాలా అందంగావుంది. ఇక్కడ. ఇది ఈ పాత భూలోకమే అనిపించడంలేదు." అన్నాడు ప్రయత్నించి ఆనందరావు.

అప్పుడు తట్టింది ఆనందరావుకి. దొరైకన్ను చచ్చిపోయినాడు. తానూ చచ్చిపోయినాడు ఇది ఇంకో లోకం. కాక తను చచ్చి ఈ కల కంటున్నాడు. దొరైకన్ను ఇంకా మాట్లాడలేదు. మాటలు మరచిపోయి జ్ఞాపకం తెచ్చుకుంటున్నట్టున్నాడు.

"ఎట్లావుంది ఆ పాతభూలోకం?" అన్నాడు.

"ఎన్నాళ్ళయింది నువ్విక్కడికివొచ్చి?"

"ఇక్కడ కాలం లేదు."

అప్పుడు కాలెండరుగాని, గడియారంగాని ఏమీ లేవు అక్కడ. ఆకాశంకేసి చూశాడు. సూర్యుడు వున్నాడు. కదిలినట్టుకూడా వున్నాడు.

మెల్లగా పరదాల్ని వొత్తిగించుకుని ఒకామె వొచ్చి కూచుంది వాళ్ళవంకచూస్తో, పెదిమలమీద ఆహ్వానపు చిరునవ్వుతో. ఆమెవొచ్చినట్టుగుర్తించనేలేదు దొరైకన్ను.

"నాలుగైదేళ్ళు ఐవుంటుంది."

"నీకు టపా రాదా ఇక్కడకి?"

"రాదు."

"మరి నా వుత్తరం ఎట్లా చేరింది?"

"చేరలేదు."

"మరి నీ ఏజెంటు..."

"చెబుతాలే."

"భూలోకంలో ఏం మార్పులు జరిగాయో నీకు తెలీదా? న్యూస్‌పేపర్లు రావా?"

"రావు."

"బ్రిటీషువారు వెళ్ళిపోయారనీ, దేశానికి స్వాతంత్రం వొచ్చిందనీ నీకు తెలీదా?"

"తెలీదు."

అని ఆమెకేసి చూశాడు అంతే.

"ఇంకేం తెలుసుకోవాలని లేదా?"

"లేదు. మాకెందుకవన్నీ ఇక్కడ?"

"ఎక్కడ ఇది?"

ఆమె ఫక్కున నవ్వింది.

"ఎందుకదంతా?"

"నీకు అక్కర్లేదులే. మరినన్ను ఎప్పుడు పంపుతావు?"

"ఎక్కడికి?"

"మావూరికి."

చిరునవ్వు నవ్వాడు ద్వారకన్న.

"ఎందుకు వెళ్ళడం?"

"ఎందు కేమిటి? వెళ్ళక?"

"ఉంటా వనుకున్నాను."

"వెళ్ళడానికి వీల్లేదు. ఇక్కడికి వచ్చినవాళ్ళకి తిరుగు ప్రయాణం లేదు." అంది నవ్వుతో ఆమె.

అతనిగుండె ఓ నిమిషం ఆగింది.

"ద్వారై, నిజంచెప్పు. నాతో వేళాకోళం ఆడకు."

"వుండు. అంత తొందరా? ఇక్కడేం బాగాలేదా?"

"వుందిలే. కాని..."

"అదంతా తరవాత, రా పోదాం."

ముగ్గురూ బైటికి వెళ్ళి అట్లా అట్లా తిరిగారు. ఇంత అందంలోంచి ఎవరుమాత్రం ఎట్లా వెడతారు? ఇక్కడ, ఈ లోకంలో ముసలితనం, కష్టం, దిగులు, చీదర, ఏమీ లేనట్టున్నాయి. ద్వారకన్న వయసులో ఎదగటం మానేసి నట్టు కనపడ్డది ఆనందరావుకి.

చల్లనిగాలిలో, అడివిపక్షుల రుతాల్లో, అనేకపరిమళాల రంగుల పుష్పవనాల్లో, చెట్లమధ్యనించి కనపడే నది, పై కొమ్మల్లోంచి కనపడే ఆకాశంనీలం యెంత తాగినా కళ్ళకు తనివి తీరలేదు.

ఇంటికి వొచ్చి భోజనంచేశారు. కారంలేదు వంటలో. పులుపులేదు. అన్నీ కమ్మగా, తియ్యగా వున్నాయి. చాలా వరకు పళ్ళూ, పళ్ళరసాలు.

భోజనమయ్యాక, కొంచెంసేపు ఇంటిముందున్న పొగడచెట్లకింద కుర్చీలలో కూచున్నారు.

"కొంచెంసేపు నిద్రపో, చదువుకో"

అని పుస్తకాలుపడేసి వెళ్ళిపోయినారు వాళ్ళు.

ఎప్పుడు నిద్రపట్టిందో.

నిద్రలో సంగీతం వినిపించింది. మధురమైన కలలతో కలిసి. ఎవరో కిన్నెరలు పాడుతున్నారు. అందమైన స్వప్న వృద్యానవనాల్లో తా నెరిగిన కంఠాలు అవి. ఎప్పుడో ఏజన్మలోనో ఎరిగినవి. సగం మెళకువ వచ్చింది గాని, అతనికి కళ్లు తెరవాలనిపించలేదు. అతనివ్వాళ్ళో అతని గది లోనే కల కంటున్నా ననుకున్నాడు.

ఆ కల కంటూనే మళ్ళీ నిద్రపోయినట్టున్నాడు. కళ్లు తెరిచేప్పటికి మధ్యాహ్నం దాటింది. అతని మొహంమీద ఎండపడుతోంది ఆకుల సందుల్లోంచి. ఎదురుగా వాళ్ళిద్దరూ టీ తాగుతున్నారు.

"లేచావా? రా."

ఎంత నిశ్శబ్దం? నౌకర్లు మాట్లాడరు, చాలావరకు కనపడరు.

మెల్లిగా జ్ఞాపకం తెచ్చుకున్నాడు. తానిక్కడకు వొచ్చిన సంగతి, హల్వా తిని టీ తాగుతో.

"మరి నా పుస్తకం ఎక్కడ వుంది?" అన్నాడు.

"నీ పుస్తకమా? ఏమయిందో? నాకు గుర్తూ?" అన్నాడు దొరైకన్ను పరధ్యానంగా.

ఆమె నవ్వింది.

"మరి నన్నెందుకు రమ్మన్నావు ఇక్కడికి?"

"నిన్ను చూడాలని. నువ్వు నన్ను చూడాలని. ఈమెని నువ్వు చూడాలని, మే మిద్దరం నిన్ను చూడాలని"

"నన్ను చూడాలనా? నన్నెందుకు?"

"నువ్వీ లోకంలో అనామకుడవి కావు."

"నేను జీవించే వున్నానా? ఎక్కడ?"

"కవులు ఎక్కడ జీవిస్తారో అక్కడ?"

"ఎక్కడ?"

"ప్రేమికుల హృదాయాల్లో."

"అంటే ఆ కవి కవిత్వాన్ని ప్రేమించే హృదయాల్లో." అంది ఆమె.

"నా కవిత్వం ఎవరికి తెలుసు?"

"ఈ లోకంలో నిన్నెరుగుదురు. అందుకనే ఇక్కడికి వొచ్చావు. యెవరు పిలిచిందీ లేదు."

"ఎందుకు వొస్తాను నే నిక్కడికి?"

"ప్రేమ పిలుపువల్ల."

"నా పనులన్నీ చెరుపుకుని."

"ఏంపని నీకు?"

"ఏ పనీ చెయ్యకుండా నే కుటుంబం జరుగుతోందా?"

"ఆ భారం వహిస్తారులే."

"ఎవరు?"

"ఈ లోకంలో వాళ్లు."

"పోనీ నా పుస్తకం సంగతేమిటి?"

"ఆ పుస్తకం నీకెందుకు ఇవ్వాడు?"

ఆమె నవ్వింది.

ఎంత అందం ఆ నవ్వు!

చెప్పాడు కథ, తన పుస్తకం అచ్చువేయిస్తానన్నారని.

"నాలుగు వేల కాపీలిస్తాడా నీకు? ఎన్నేళ్లు అమ్ముతావు అవి?"

"వందేళ్లు. ఎవడు కొంటాడు?"

"మరి యెందుకు అచ్చువెయ్యడం?"

"ఏమిటో! సరదా."

"మళ్లా రాసుకో ఆగితాలు."

"చాలా సులభం!" అన్నాడు ఆనందరావు వెక్కిరింపుగా!

"అయినా పుస్తకం ఎంత ఖరీదు పెడతావేమిటి?"

"ఏమో, ఇప్పుడేం తెలుస్తుంది"

"రెండు రూపాయ లనుకో"

"అబ్బో, అంతే?"

"ఆ ప్రకారం అవన్నీ అమ్ముడుపోతే ఎనిమిదివేల రూపాయలు. నే నిస్తాలే."

"ఎందుకు? పనిలేక. డబ్బుకోసమా అచ్చువేసుకుంటోంది?"

"బీదవాడినంటివిగా ?"

"అవునులే. ఆ కాపీలు అమ్మడుపోయి డబ్బు వొచ్చి నప్పుడుగా ! సరదాకి."

ద్వారైకన్న లోపలికివెళ్ళి ఓ పుస్తకం కలం తీసుకొచ్చాడు.

"పుస్తకాల ఖరీదు పదివేల రూపాయలు; సరదా ఖరీదు పదివేల రూపాయలు. ఇందచెక్కు." అని ఇరవైవేల రూపాయలకి రాసిఇచ్చాడు. ఆనందరావుకి ఏం అనాలో, చెయ్యాలో తెలీలేదు.

"ఈ గొడవంతా యెందుకు, నా పుస్తకం యెక్కడ వుంటుందో చెప్పరాదూ ?"

"పోయింది."

కవి పాపం. ఇరవైవేల రూపాయలంటే, తనకి గొప్ప అదృష్టం. కాని యెన్ని రూపాయలిస్తేనేం ? తన చిన్ననాటి కవిత్వం. పైగా ఈ డబ్బు ఏ మొహం పెట్టుకుని తీసుకుంటాడు తాను ?

"ఈ లోకంలో చెక్కులు వున్నాయన్నమాట" అన్నాడు.

'ఉన్నాయికాని ఆ లోకంలోకి వడితేనేగాని మారవు' అని నవ్వింది ఆమె.

టీ కాగానే "స్నానం చేద్దామా ?" అని లేచాడు ద్వారైకన్న.

"ఈ చెక్క నీ దగ్గిరే వుంచు" అని ఇచ్చేశాడు ఆనంద్.

ముగ్గురూ నది దగ్గిరికి వెళ్ళారు. అస్తమించేసూర్యుడు మెరిసే తెల్లని ఇసికకింది రేవు దగ్గిరికి నదిని లోపలికి చెట్ల మధ్యకి తవ్వి ఒక కోనేరు ఏర్పరిచారు. దానిచుట్టూ చలవ రాతి మెట్లు.

రెండురోజులు గడిచాయి ఇట్లా. మూడోరోజున వెడతానన్నాడు అతను.

రేపు వెళుదువుగానిలే అన్నారు వాళ్ళు. అతనికి వెళ్ళిపోవాలని గట్టిగా వుంది. వాళ్ళిద్దరిలో వాళ్ళిద్దరూ. ఎంతైనా తను వేరు. పైగా అంత శాంతం, అందం భరించ లేకండా వున్నాడు.

మళ్ళీ పుటకలు వుంటే, ఆ లోకపు చీదర లేనితనాన్ని అందాన్ని భరించలేకనే మళ్ళీ పుట్టాలని కోరుకుని ఈలోకం లోకి వొస్తారేమో జీవులు:

ఆ రాత్రి దొరైకన్ను అడిగాడు ఆనందరావుని—

"పుస్తకం పోతేపోయిందిలే, నీ కవిత్వం వినిపించు" అని.

"మరిచిపోయినాను."

"జ్ఞాపకం వున్నంతవరకు."

అక్కడక్కడ కొన్ని పాదాలు వినిపించాడు.

"ఇన్ని సంగీతవాయిద్యాలున్నాయి. ఆమె పాడరా?" అన్నాడు.

"ఎబ్బే! ఏమిటో ఉన్నాయి. అవి ఉపయోగించడం యెవరికీ చాతకాదు."

"ఆమె పాడరా పోసీ?"

"పాడతారు."

ఆమె తంబుర స్రుతిచేసుకుని పాడింది పూర్వకాలపు కీర్తనలూ, జావళీలూ... తాను మొదటిరోజున కలలో విన్న సంగీతమే. కాని ఆమెకంఠం ఇంకా పూర్వపు స్మృతుల్ని రేపుతోంది. ఆమె రెండుమూడు శ్లోకాలు పాడింది. తరవాత కృష్ణశాస్త్రిగారి...

"అన్వేషణ." తరవాత "నీవేరె నా రాజు, జపమన్న అపవాదు" అనిపాడింది.

తరవాత ఇంకెవరిదో కొత్తకవిత్వపు కీర్తన పాడింది. "ఆమెపాటలు సంధ్య నీడలు" అని.

ఎవరిదబ్బా ఆ కీర్తన చాలా మధురంగావుంది! ఆమె కళ్ళవెంబడి నీళ్ళు చెక్కిళ్ళమీదికి కారుతున్నాయి. కరిగిపోయినాడు కవి ఆమె పాటకే తగును ఆగీతం—

ఆరాగాల వూపులో ఊగి ఊగి.

ఆమె స్వరాల కూర్పులో, ఆగి ఆగి.

అని వినేప్పటికి ఒక కేకవేశాడు. అది అతని గీతమే. పూర్వం కళ్యాణి పాట విని అతను రాసిన గీతం. దాన్ని కీర్తన కిందచేసి పాడుతోంది.

ఆ కంఠం! ఈమే ఆ కళ్యాణి. తన స్వప్నాల సుందరి.

ఆమె పాటసీ, అతని జ్ఞప్తిని చాలా యెన్‌జాయ్ చేస్తున్నాడు దొరైకన్ను.

పాటకాగానే—

"కళ్యాణి, కళ్యాణి" అన్నాడు ఆనందరావు. తర వాత, "నాగీతం" అన్నాడు.

పారేసిన తన గీతాలకి, యెక్కడా యెవడూ వినీ గట్టిగా మెచ్చుకోని తన గీతాలకి ఇరవై వేల రూపాయలు చెక్కు రావడంతోటే, ఆనాటినించి తన గీతాలమీద అభి మానం ఎక్కువయింది కవికి. ఆమె పాడిం తరవాత ఒక్కొక్క గీతమే ఇరవై వేల రూపాయలకన్న విలువ గలది అనిపిస్తోంది.

ఆనందరావు ఆమెని కావిలించుకునేవాడే, అది వాళ్ళిద్దరూ వొప్పుకోరనిగాని. చేతులు నమస్కారం మల్లే ముడుచుకుని, గొప్ప ఎడ్మిరేషన్‌తో మాట్లాడకండా కూచు న్నాడు.

"కళ్యాణి-నా కలలోని గాయకురాలు. నా మిత్రుడి భార్య అని తెలీదు నాకు" అన్నాడు. అనగానే జ్ఞాపకం వొచ్చింది. కళ్యాణి ధనవంతుడైన చెట్టియారుతో లేచి పోయిందని, దొరైకన్ను చెట్టియార్ కాదే! ఇద్దరి మొహాల వంకా చూశాడు, ప్రశ్నార్థకంగా. కాని ఇది భూలోకం కాదు. చచ్చిపోయి కలిశారు ఈలోకంలో వీళ్ళిద్దరూ.

దొరైకన్ను ఆనందరావుని తీసుకుని అడివిలో షికారు తిరుగుతున్నాడు. ఆ నిశ్శబ్దంలో చెప్పాడు తన కథ:

దొరైకన్ను భార్య చిన్నప్పుడే చచ్చిపోయింది. తనది చాలా పెద్ద ఆస్తి. పెద్ద వర్తకం. ఆనందరావుమల్లేనే కళ్యాణి పాటవిని ఆమెని కలుసుకున్నాడు. మోహించాడు. పెళ్ళి చేసుకుంటాననాన్నడు. కాని ఆమె భర్త యెక్కడో ఇంకా బతికివున్నాడట. అతనినించి పారిపోయివొచ్చి మద్రాసులో దాక్కుని, ఏమీ చేతగాక, రేడియోవారి ధర్మంమీద బతుకుతోంది. పెళ్ళికాకండా పురుషుడితో సంబంధం చాలా అసహ్యం, భయం ఆమెకి. ఆమెని అనేక విధాల—పాటకచేరీలు, సినీమాకంపెనీలు, ఆస్తి, ధనం, ఇన్ని ఆశలు పెట్టాడు అతను. కానిఅవన్నీ ఇదివరకే చాలా మంది Offer చేశారంది. అతనికి వెర్రెక్కింది. మిత్రుడికింద ఆమెని చూస్తో ఉండనీమన్నాడు. కాని అతనినించి డబ్బు తీసుకోదు. ఏ Presents తీసికోదు. ఎప్పుడన్నా అతని ఇంటో టీతాగేది. కాని అతన్ని చాలా అనుమానంగా చూస్తోంది. ఎవడో తను చాలా దుర్మార్గుడని ఆమెకి చెపుతున్నాడని అతనికి తెలుసు.

ఒకరాత్రి అకస్మాత్తుగా తన యింటికి చాలా Perturb ఐ వొచ్చింది. తనని తీసుకోమంది ఏమరతులూ లేకండానే. ఆమె వెనకనే ఒక అతను వొచ్చాడు. రేడియో కారులో. తోట గేటుదగ్గిరే కలుసుకున్నాడు అతన్ని దొరైకన్ను. అతను భద్రయ్యట — కళ్యాణి అవసరంగా తనకి కావాలన్నాడు, యేదో రేడియో ప్రోగ్రాం సంగతి మాట్లాడడానికి. 'ఇంక రేడియోలకిరాదు ఆమె' అన్నాడు దొరైకన్ను. ఆమెతో మాట్లాడాలన్నాడు తను. తను లోప

లికి వెళ్ళి కళ్యాణితో చెప్పేటప్పటికి, "ఇక్కడికివొచ్చాడా? యెట్లా తెలిసింది !" అని వొణికిపోయింది. తనమీద సాడీలు చెపుతున్నవాడు భద్రయ్యేనని తెలిసింది. ఆ భద్రయ్య మూలానే ఆమె తనపాలబడ్డది, అని తెలుసుకునేటప్పటికి మొదటిదానికి ఆ భద్రయ్యని తన్నాలనీ, రెండోదానికి బహూకరించాలనీ, రెండూ ఒకసారే అనిపించాయి. ఇంతలో అతనే ప్రవేశించి దూకుడుగా 'కళ్యాణి' అంటున్నాడు. బైటికిపో అన్నాడు దొరైకన్ను. దొరైకన్నని తోసుకుని అతను... ఒక్కటి ఇచ్చుకున్నాడు అతనికి—కింద పడిపోయి నాడు భద్రయ్య. బూట్సుకాలుతో తన్నాడు. అతను పోగానే కళ్యాణి అతన్ని వేడుకుంది; మనిషి అనేవాడు కనపడనిచోటుకి, ఎవరికీ తెలీనిచోటుకి తనని తీసుకుని పొమ్మని. భర్త భయంకూడా వుంది ఆమెకి.

ఆ నదిమధ్య ఈ అడివి ద్వీపాన్ని కొని దాన్నిట్లా బాగుచేయించి ఆమెతో వొచ్చేశాడు. అవతల గట్టున ఒక ఏజెంటు తనకి కావలసిన సామానులు కొని పంపేందుకు, మద్రాసులో ఒక ఏజెంటు తనకి అవసరమైన డబ్బు పంపేందుకు, మిగిలినడబ్బు ధర్మాలకి వినియోగించేందుకు. ఆ ఏజెంటుకి ఈ ఏజెంటుకీ మధ్య ఫోను. దాంటోనే చెప్పారు అతనికి ఆనందరావు చూడాలంటున్నాడని. దొరైకన్ను యెక్కడ ఉన్నదీ ఆ ఏజంట్లకి ఇద్దరికీ తప్ప ఇంకెవరికీ తెలీదు. వాళ్ళిద్దరు అక్కడ కాపరం ఏర్పరుచుకున్న తరవాత ఆనందరావే మొదటివాడు ఆ ద్వీపంలో కాలుపెట్ట

డానికి అని తన వృత్తాంతం చెప్పాడు ఆనందరావుకి. తర వాత చాలాసేపు మౌనంగా నడిచారు; చివరికి ఇంటివేపు.

కళ్యాణి తాంబురని అట్లానే ముందు పెట్టుకుని కూచుని వుంది. గర్భగుళ్ళో అలంకరించిన దేవతా విగ్రహం మల్లే. ఆమె కట్టుకున్న నీలంఅంచు సేలం పట్టుచీరు పమిట గాలిలో చిన్నగా వూగుతో ఆమెను తాకే ఆనందాన్ని అనుభవిస్తున్న ట్టుంది. ఆమె పాదాల్ని కప్పి కుచ్చెళ్లు వాటిల్లో అవి నవ్వు కుంటున్నాయి. కబుర్లు చెప్పుకుంటో, చుట్టూవున్న ఆ స్వర్గ రామణీయంలో స్వప్న స్వర్గాల్ని నిర్మించుకుంటు న్నాయి ఆమెకళ్లు అనిపించింది ఆనందరావుకి. ఆమెని చూస్తో కొంచెంసేపు నిలబడ్డాడు ద్వారైకన్ను. వాళ్ళనిచూసి ఆమె కదిలింది సోమరిగా.

దీపాల కాంతికింద కూచున్న ఆమెనించి ప్రయత్నంగా కళ్లు తిప్పుకుని, ఆనందరావు కేసి చూశాడు ద్వారైకన్ను.

"ఏమిటి అట్లా ఉన్నావు!"

"ఏం పని చేశావని!"

"నిజమే!" అని బిగ్గిరగా నవ్వాడు. పెద్ద ఆశ్చర్యం ఆ నవ్వులో.

"నే నేదో చాలా ఘోరమైనదో బుద్ధితక్కువైన పనో చేశాననే!" అన్నాడు వెంటనే.

"అవును. నువ్వు ఇక్కడికి రాకండా అక్కడేవుంటే యుద్ధకాలంలో కోటీశ్వరుడి వయ్యేవాడివి. తెలుసునా! జైలుకికూడా వెళ్ళావుకాదూ, మధ్యలో చదువు మాని

ఇంకేం? నిస్సందేహంగా మంత్రి వయ్యేవాడివి. ప్రధానివి కూడా అయ్యేవాడివి."

"మా నాన్నగారు గవర్నరు దగ్గిర Executive Counsellor అప్పుడే అంత ఆస్తిని సంపాయించగలిగారు. ఆయన ఎంత సుఖపడ్డారో నే నెరుగుదును."

"ఇంకేం, ఎరిగేనా ఈ పనిచేశావు? ఏం బతుకు ఇది? ఈ మెకి మాత్రం ఆ సంగీతంతో ఈ పాటికి ఎంతకీర్తి?"

ఎంతధనం. యెంత ఔన్నత్యం? "సినీమాల్లో నే నటించి వుంటేనా!"

"నటిస్తే?"

"ఏం బతుకు ఇది? ఎవరికి ఉపయోగం? ఎవరు చూడను? ఎవరు మెచ్చను?"

"నువ్వా."

"నేనా!"

"అవును నువ్వే. ఎవరూ ఇంతవరకు కాలు పెట్టని ఈ ద్వీపంలోకి, నిన్ను ఆతురతతో ఆహ్వానించామంటే, నిన్ను ప్రజలనించి యెంత వేరుగా భావించివుంటామో ఆలోచించు."

"నేనేం వేరు?" అని దొరైకన్ను మాటల్నితుడిచి వేసి తన ఆలోచనాధోరణిలోనే కొట్టుకుపోయినాడు ఆనంద రావు.

అట్లానే గొప్ప క్షణాలు జీవితంలో తటస్థించినప్పుడు, గొప్పకాంతికి కళ్లు తెరిచే గడపమీద మనిషినుంచునే

Opportunity కలిగినప్పుడు, ఇదివరకు బతికిన వీళ్ళబలుపు కళ్ళని మూసేస్తుంది. జీవితచక్రంసాగే పాతగాళ్ళ, చక్రాల్ని వొదిలి కదలనీవు. ఎగరనీవు. పెద్దపాపాలు నయం. మామూలు నగంప్రద బతుకుకన్న, డబ్బు, మర్యాద, సంసారం, విలవల సారం లాగేనే, మొదడుమీద పాచి అట్టల్ని కప్పే దినదిన మామూల చర్యలుకన్న.

"ఏం వేరుగా భావించారు? ఏమీ నీతి నియమాలు లేని అమర్యాదస్తుణ్ణనా, లేక ఏమి అర్థంకాక, ఐశ్వర్యం చూసి కళ్లు భ్రమిసే తేలికమనిషిననా?"

మనుషుల కళ్ళల్లో తన కవిత్వపు రోజుల చులక దనాన్ని మరిపించి, తాను ఒక ఘరానా కుటుంబీకుణ్ణని మనుష్యుల్ని impress చేసేందుకు అతను చేసిన పరిహారం— పలికింది. అన్నేళ్ళ ఘన ప్రయత్నమూ ఇంకా అంటు న్నాడు.

"మీ జీవితాలు మీకే సిగ్గు కాకపోతే వొంటరిగా పారిపోయి వొచ్చి ఈమూల ఎందుకు దాక్కుంటారు?"

ఆ మాటల్లో దొర్లొకన్నా, కళ్యాణి ఆశ్చర్యమే కాదు, సిగ్గుపడే ఒకళ్ళమొహాలు ఒకళ్ళు చూసి తెల్లపోయి నారు. ఇంక తలెత్తి చూసుకోలేక, వొంచేశారు ముఖాల్ని. తన మాటలు బాగా పనిచేసి, వాళ్ళకి బుద్ధి చెపుతున్నా ననిపించింది కవికి.

"నువ్వే మంత్రివైతే నాబోటివాళ్ళకి యెంతమందికి ఉపయోగపడేవాడివి? యెంత హోదా? బ్రతికినందుకు

యెంత ప్రయోజనం? ఎన్ని కొత్త సంస్కారాలు తీసుకు వొచ్చేవాడివి?"

"నా వంటివాడు అట్లాంటి గొప్ప కార్యాలు చేస్తా డని యెందు కనుకుంటావు?"

"పోనీ, నావంటివాడి సలహాలవల్ల, విపరీతమైన ధరలు, లంచగొండితనం, ఈ కార్మికులు ఇట్లా హక్కులకోసం అల్లరి చెయ్యడం—ఇవన్నీ ..."

"మీరేనా ఆ కవిత్వం రాసింది?" అని ఆయాస పడుతున్నట్టు అడిగింది, ఆమె.

"ఏం కవిత్వం?"

దొరైకన్ను అందుకున్నాడు!

"ఆమె పాటవిని ఆమె గాన మాధుర్యానికి, దేవతలు సువర్ణ పుష్పవర్షం కురిపించవొచ్చునని, ఏ లోకాధిపతి ఐనా, తన కిరీటాన్ని ఆమె పాదాలముందు అర్పించ వొచ్చని,"

"అదా? అది కవిత్వం, చిన్నతనంలో రాసింది. అది అలంకారం. తెలిసిందా?"

"అవును, తెలిసింది .... మరి నువ్వు వెడతా నంటున్నావుగా, రేపు పొద్దున్న వెళ్ళు."

"ఊఁ."

మర్నాడు తెల్లారకట్టే లేపాడు దొరైకన్ను. ఉషా కాంతులు తూర్పు నదీ ఎరుపులో ఏకమైనాయి. కొత్తగా ఆనాటికి విచ్చుకున్న జాజి, గోరింట, నారింజ పూల

పరిమళాల్లో 'టీ' తీసుకున్నారు. అప్పటికి ఆనందరావు ఆత్మ కొంచెం మేలుకుంటోంది.

"నేను కఠినంగా మాట్లాడానా దొరై, నిన్నరాత్రి! నేను చాలా నిష్కపట్టుణ్ణి. అనుకున్నది అనేస్తాను. మిమ్మల్ని offend చేశానేమో!"

"లేదు."

"అట్లా మాట్లాడడం తప్పంటావా?"

"ఎబ్బే! ఏం కాదు."

"నువ్వేదో బాగా లేవు."

"ఊఁ."

"మరి చెప్పరా? నావల్ల నేనా?"

"నీకుమల్లే నేను నిష్కపటిని కాను."

"ఆమాటంటే నే నొప్పుకోను. నా ఉద్దేశ్యం, నాకేమనిపించిందో నేను చెప్పాను కదా ఏ ఆలోచనా లేకండా—"

"అట్లా మాట్లాడినందుకు నీ అభేధత్వానికి చాలా మెచ్చుకుంటున్నాను. స్నేహం అట్లానే వుండాలి."

"పోనీ. నా మాటల్లో ఏం తప్పువుందో చెప్పుపోనీ?"

"తప్పేంలేదు."

"మరి......."

"దృక్పథాల భేదం."

"నీ దృక్పథం ఏమిటి?"

“ఇదే.”

అని తోటకేసీ, ఆకాశంకేసీ చూశాడు.

“నాదీ?”

“అదీ” అని నది అవతల వొడ్డుకేసి చూశాడు.

“అవును, అవును.” అని నవ్వాడు ఆనందరావు.

గుంపులు గుంపులుగా పక్షులు ఎగురుతున్నాయి. సూర్యుడి మొదటిఎండ కాలేజి చూర్ల మీద పడుతోంది. చెట్ల నీడల్లోంచి, వాళ్ళు వెడుతోవుంటే ఆ అడివి అతని కోసం దిగులుపడుతోందనిపించింది. వెళ్ళేప్పుడు తడుతోంది, ఆ ప్రదేశపు అపార సౌందర్యం; చచ్చిపోయేవాడికి మామూలు పాతలోకం ఎంత అందమో విషాదంగా కనపడ్డట్టు. తన మిత్రులకి తనమీద ఎంత స్వార్థంలేని ప్రేమో.

అతన్ని సాగనంపి దొరైకన్ను వెనక్కి తిరిగిచూడకండా చెట్లలోకి చూస్తో వెళ్ళిపోయినాడు. పడవలో అంతా వెనక్కి వెనక్కి తిరిగి చూస్తోనే అన్నాడు. ఆనందరావు అతనికి తెలీకండానే లోపల అనిపిస్తోంది ఏదో గొప్ప అదృష్టాన్ని పోగొట్టుకున్నానని.

ఏజెంటు అతనికి వాళ్ళవూరికి తెల్లటిక్కెట్టు, కొని, రైలెక్కించింతరవాత తెలిసింది, మనుషులూ, రైలెక్కే ఆదుర్దాలూ, రైలు ఉద్యోగస్తుల మొహాలూ, పొగా, దుమ్మూ, ఈగలూ, కుటుంబాలూ, పిల్లల ఏడుపులూ వినేటప్పటికి-ఏమైపోయినాడో అతను. స్వర్గంనించి తోసేస్తే కిందపడ్డ నహుషుడిమల్లే ఐనాడు. ఏంతోచలేదు. వాళ్ళిద్దర్నీ

తలుచుకున్నాడు. ఈ మనుషులతో పోల్చిచూస్తే వాళ్ళల్లో దేవతల వర్చస్సు తోచింది. అతని కళ్ళముందు వాళ్ళ మొహాలు, వాళ్ళ స్మితం, వాళ్ళ ప్రేమ. వాళ్ళచుట్టూ కళావాతావరణం.

తాను ఇంటికి పోతున్నాడు. తన తోటివర్తకులూ, బేరాలూ, కొన్నిఏండ్లు ఎక్కడికో ఇంకో లోకానికి వెళ్ళి నట్టుంది, అతని మనసు. ఎంత నష్టం! ఎన్ని బేరాలు పోయి నాయో! ఆ చెక్కునన్నా దాచుకున్నాడు కాదు తాను. ఇరవై వేలు! తన జన్మకి!

టిక్కెట్టు కలెక్టరు వొచ్చాడు. టిక్కట్టుకని చూస్తే జేబులో ఓ కవరువుంది. దాంట్లో వుత్తరం.

ఆనంద్,

మేమిట్లా ఐపోయినామని దిగులు పడుతున్నావా? ద్వేషిస్తున్నావా? మా ఈ స్థితికి నువ్వే కారణం, నీకవిత్వమే కారణం, నేనసలు కళ్యాణినికలుసుకోడానికి. నీపుస్తకం అచ్చు వేయిస్తో నీమీది ప్రేమవల్ల, నీ పద్యాల ప్రూఫులు నేనే స్వయంగా దిద్దాను. కళ్యాణి గానంమీద నువ్వు రాసిన పద్యాలు విని, ఆమెని వెతికి పరిచయం చేసుకున్నాను. మా ఇద్దరం ఎటువంటి వాళ్ళమైతేనేంలే. మేం కలుసుకోవడంవల్ల మానవులకి సాధ్యంకాని ఆనందాన్నందుకున్నాం. కాల మంతా ఒకగొప్పవెలుగై మమ్మల్ని మబ్బుల్నిమల్లే తనలో కరిగించేసుకుంది. నేను మంత్రినై, ఆమె తారనై, ఏదో ప్రపంచోద్ధరణ చేద్దుమని అన్నావు. ఇప్పుడు ప్రపంచోద్ధరణ చేసేమంత్రులూ తారలూ మావంటివారే. మేమేంప్రత్యేకం

కాదు. అదృష్టం ఒక్కసారే పిలుస్తుంది ఏ మనిషినైనా. ఆ పిలుపును గుర్తించగలిగినవాళ్ళు ధన్యులు. మా అదృష్టం ఎటువంటిదో మేం గుర్తించగలగటం దేవతానుగ్రహం. అంతకన్న నీ కవితానుగ్రహం.

నీ పుస్తకం మాదగ్గిరేవుంది. ఆ గీతాలు ప్రపంచం అంగీకరించదు. వాటి కర్తకూడా వాటిని అంగీకరించకండా disown చేశాడు. కనక అవి మావి, వాటివిలువ మాకే తెలుసు. ఏగొప్ప శుక్రుడో కొన్నాళ్లు నీ జాతకానికన్నా పట్టి వుండాలి. పూర్వజన్మంలో కొద్దికాలం నువ్వు రతీ సరస్వతీ పూజలన్నా చేసివుండాలి. వెలిగింది నీకలంలో అద్భుతశక్తి కొన్నాళ్లు. గుర్తులేకండా వొదిలిపోయింది.

కళ్యాణి హృదయంలో నువ్వు ఎంత గొప్పగా వెలుగు తున్నావో, నీకు తెలిపే వీలునన్నా ఇచ్చావుకావు. కాని నిన్ను చూడగానే అంది ఆమె నాతో 'ఇతను కాదు ఆ గీతాలురాసింది'' అని.

మమ్మల్ని కనుక్కోడానికి ప్రయత్నించకు. ప్రయత్నించి లాభంలేదు.

దీంటో పెట్టిన చెక్కులతో నీ గీతాల విలవని ఒక్క రవ్వ తీర్చుకుంటున్నాను. నేను చాలా ధనవంతుణ్ణి. ఆ డబ్బు తీసుకోవడానికి సంశయించకు. నా బాకీవాళ్ళకి ఫోను చేశాను. మార్చుకోడానికి ఇబ్బందేమీ వుండదు.

—దొరైకన్ను.

యాభై వేలరూపాయలకి చెక్కు. గబగబ ఏడ్చాడు ఆనందరావు. ఆ చెక్కుని చింపే సాహసంలేక గుంజుకున్నాడు.